సాక్షి
ములుగు
బుధవారం । 12 । జూన్ । 2024



రిజిస్ట్రేషన్‌శాఖలో బదిలీలు?
రిజిస్ట్రేషన్‌శాఖలో బదిలీలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలుస్తోంది. వారం రోజుల్లో బదిలీ ఉత్తర్వులను జారీ చేసే అవకాశం ఉంది. - 10లో▸



అపరాల సాగు లాభదాయకం
అపరాల సాగు రైతులకు లాభదాయకమని వరంగల్ వ్యవసాయ పరిశోధన స్థానం సహ పరిశోధన సంచాలకుడు ఉమారెడ్డి అన్నారు. - 10లో▸

గరిష్టం/కనిష్టం
37.2^0 / 26.4^0

వాతావరణం
జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమై పలు చోట్ల ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

'బడిబాట'ను విజయవంతం చేయాలి



ములుగు: బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేసి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని అదనపు కలెక్టర్ శ్రీజ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో డీఈఓ పాణిని, డీఆర్‌డీఓ శ్రీనివాస్ కుమార్‌లతో కలిసి అదనపు కలెక్టర్ జిల్లాలోని మండల విద్యాశాఖ అధికారులతో మంగళవారం బడిబాట కార్యక్రమంపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విలేజ్ ఎడ్యుకేషన్ రిజిస్టర్‌ను ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలన్నారు. శక్తి వంచన లేకుండా పనిచేస్తూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలన్నారు. పాఠశాలల్లో బడీడు పిల్లలను చేర్పించి నమోదు శాతాన్ని పెంచాలన్నారు. ఈ సమావేశంలో సమగ్ర శిక్ష కోఆర్డినేటర్లు రాజు, సాంబయ్య, రమాదేవి, మల్లారెడ్డి, మండల విద్యాశాఖాధికార్లు శ్రీనివాసులు, దివాకర్, సురేందర్, సాంబయ్య, వెంకటేశ్వర్లు, రాజేష్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థుల సంఖ్యను పెంచాలి

ములుగు రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచే విధంగా చూడాలని ఉపాధ్యాయులను అదనపు కలెక్టర్ శ్రీజ ఆదేశించారు. మండల పరిధిలోని జంగాలపల్లిలో మంగళవారం చేపట్టిన గ్రామసభ, బడిబాట కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో తక్కువ విద్యార్థులు ఉన్న పాఠశాలలపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. గ్రామాలలో ప్రత్యేక విలేజ్ ఎడ్యుకేషన్ రిజిస్టర్‌ను ఏర్పాటు చేసి విద్యార్థుల సంఖ్య, వివరాలు ఉండేలా చూడాలన్నారు. గ్రామసభలు నిర్వహించి గ్రామస్తులు ప్రభుత్వ పాఠశాలలకు పిల్లలను పంపించే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి పాణిని, ఎంఈఓ శ్రీనివాసులు, ఎంపీడీఓ రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి తిరుపతి పాల్గొన్నారు.

ఇసుక క్వారీల పరిశీలన



మంగపేట: మండల పరిధిలోని పొదుమూరు, మల్లూరు, చుంచుపల్లి, రాజుపేట, కత్తిగూడెం, వాడగూడెంలోని గిరిజన సొసైటీ, పట్టా భుముల ఇసుక క్వారీలను అదనపు కలెక్టర్ మహేందర్ జీ స్థానిక రెవెన్యూ అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా ఇసుక క్వారీలను క్షేత్ర స్థాయిలో సందర్శించిన ఆయన క్వారీల పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా ఆయా క్వారీల గడువు ముగిసినప్పటికీ కొందరు క్వారీ నిర్వాహకులు ఇతర ప్రాంతాలలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకాలు జరుపుతూ డంపు చేస్తున్నారనే ఆరోపణలపై ఆయన విచారణ జరిపారు. ఈ విషయాలపై రెవెన్యూ అధికారులతో పాటు టీఎస్ఎండీసీ, మైనింగ్, ఇరిగేషన్ అధికారులను పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మంగపేట తహసీల్దార్ వీరస్వామి, డిప్యూటీ తహసీల్దార్ మల్లేశ్వరరావు, టీఎస్ఎండీసీ పీఓ తారక్‌నాథ్ రెడ్డి తదిదరులు పాల్గొన్నారు.


స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి



వాజేడు: స్వయం ఉపాధితో రైతులు, యువకులు ఆర్థికాభివృద్ధి సాధించాలని మండల ప్రత్యేకాధికారి సర్దార్‌సింగ్, సిడ్బీ బ్యాంకు డీజీఎం రాంమోహన్ అన్నారు. మండల పరిధిలోని ప్రగళ్లపల్లిలో మంగళవారం రైతులు, యువకులకు కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశాల మేరకు స్వయం ఉపాధిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సోలార్ సిస్టమ్ ద్వారా విద్యుత్ ఉత్పత్తిని చేపట్టడం, వ్యవసాయ రంగంతో పాటు గృహ వసరాలకు ఉపయోగించుకోవచ్చని తెలిపారు. అవసరానికి పోగా మిగులు విద్యుత్‌ను ప్రభుత్వానికి విక్రయించి నగదును పొందవచ్చని సూచించారు. సోలార్ సిస్టమ్‌కు ప్రభుత్వం నుంచి 30 శాతం సబ్సిడీపై పొందవచ్చని తెలిపారు. అదే విధంగా నిరుద్యోగ యువతీ యువకులు అనుకూలమైన రంగం ఎంపిక చేసుకుని తమకు వివరాలను అందజేస్తే ఆ రంగంలో రాణించేలా శిక్షణ ఇప్పిస్తామని వివరించారు.

సస్యరక్షణతో అధిక దిగుబడి

వాతావరణ అనుకూల పంటలు వేయాలి
- వర్షాలు సమృద్ధిగా కురిస్తేనే నార్లు పోయాలి
- పత్తి సాగుకు సమయం ఉంది.. తొందరపడొద్దు
- 'సాక్షి' ఫోన్‌ఇన్‌లో జిల్లా వ్యవసాయ అధికారి విజయ్‌చంద్ర
- రైతుల సందేహాలను నివృత్తి చేసిన డీఏఓ


ఫోన్‌ఇన్ కార్యక్రమంలో రైతుల సందేహాలను నివృత్తి చేస్తున్న డీఏఓ విజయ్‌చంద్ర

ములుగు రూరల్: పంటల సాగులో రైతులు సస్యరక్షణ పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడి వస్తుంది. వాతావరణ అనుకూల పంటలు సాగుచేసుకోవాలి. వర్షాలు సమృద్ధిగా కురిసిన తర్వాతనే నార్లు పోయాలి. పత్తి సాగుకు ఇంకా సమయం ఉంది. రైతులు తొందరపడి ముందుగా పంటలు సాగుచేసి నష్టపోవద్దు. సేంద్రియ ఎరువులు వాడి దిగుబడి పెంచుకోవాలి. ఇందుకు జీలుగు, పచ్చిరొట్ట, జనుము విత్తనాలు చల్లుకొని పూత దశలో దున్నాలి. ఇలా అయితే భూమిలోని పోషకాలు పెరగడంతో పాటు మంచి దిగుబడి వస్తుందని జిల్లా వ్యవసాయశాఖ అధికారి విజయ్‌చంద్ర రైతులకు వివరించారు. మంగళవారం 'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహించిన ఫోన్‌ఇన్ కార్యక్రమానికి జిల్లా రైతుల నుంచి విశేష స్పందన వచ్చింది.

ప్రశ్న: పత్తిలో గులాబీరంగు పురుగు నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలి?
– బొంతల రాజు, ములుగు

జవాబు: పత్తి పంటను ఎక్కువ కాలం చేనులో ఉంచకుండా జనవరిలో దుక్కిలో కలియ దున్నాలి. పత్తి పంట అనంతరం అపరాల సాగు చేపట్టాలి. వేసవిలో లోతు దుక్కులు చేపట్టడం వల్ల గులాబీరంగు పురుగు నివారణ చేయవచ్చు. పత్తి సాగులో గులాబీరంగు పురుగు నివారణకు వేపనూనె లేదా ఇమామెక్టిన్ బెంజోయేట్ పిచికారీ చేయాలి.

ప్రశ్న: పత్తి సాగులో ఎరువు వినియోగం ఎలా ఉండాలి?
– కొనుపుల కుమార్, ములుగు

జవాబు: పత్తిపంట సాగుకు ముందు ఎకరాకు ట్రాక్టర్ లోడ్ పశువుల ఎరువును వేసుకోవాలి. భూమిలో జింక్ లోపం లేకుండా దుక్కిలో ఎకరాకు 20 కిలోల జింక్ వేసుకోవాలి. పంట సాగులో ఎకరాకు 100 కిలోల యూరియా, 50 కిలోల డీఏపీ, 40 కిలోల పొటాష్‌ను వినియోగించాలి. దీంట్లో 30 కిలోల యూరియా, 50 కిలోల డీఏపీ, 10 కిలోల పొటాష్‌ను ముందస్తుగా దుక్కిలో వేసుకోవాలి.

ప్రశ్న: మిర్చి నారు కుళ్లిపోకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?
- గౌరారం చంద్రశేఖర్, ధర్మారం, వాజేడు

జవాబు: మిర్చి సాగులో వేరుకుళ్లు బెడద ఉంటుంది. నారు మడి దుక్కిలో పశువుల ఎరువు, ట్రైకోడర్మా, సుడోమన్స్‌ను ఎరువులో కలుపుకొని దుక్కిలో వేసుకోవాలి. నాలుగు సంవత్సరాల వరకు ప్రతిఏటా ఎకరాకు 4 కేజీల ట్రైకోడర్మా, సుడోమోనాస్ వేసుకోవడం వల్ల వేరుకుళ్ల నివారించవచ్చు. నారుమడి 40 మీటర్ల పొడవు, 1 ఫీట్ ఎత్తు ఉండేలా చూసుకోవాలి. నీరు వెళ్లిపోవడానికి వీలుగా ఉంటుంది.

ప్రశ్న: పత్తి విత్తనాలను ఎప్పటి నుంచి విత్తుకోవాలి?
– నరెడ్ల వేణు, వెంకటాపురం(ఎం)

జవాబు: వర్షాలు సమృద్ధిగా పడిన తర్వాత పత్తి విత్తనాలను సాగు చేసుకోవాలి. పత్తి సాగు జూన్ 20 నుంచి జూలై 15వరకు సాగు చేసుకోవచ్చు. ఆ తర్వాత సాగు చేయకూడదు. రైతులు తొందరపడి పత్తిసాగు చేయకూడదు. ఇప్పటి వరకు జిల్లాలో సరైన వర్షపాతం నమోదు కాలేదు.

సాక్షి ఫోన్ ఇన్

ప్రశ్న: చౌక భూముల్లో ఎలాంటి వరి విత్తనాలను సాగు చేయాలి?
– దుర్గాప్రసాద్, వెంకటాపురం(కె)

జవాబు: చౌ నేలల్లో నీటి లభ్యతను బట్టి వరి విత్తనాలను సాగు చేసుకోవాలి. నీటి వనరులు అధికంగా ఉంటే 1282, 1264, వరంగల్ సన్నాలు, జేజేలు, రామప్ప వంటి విత్తనాలను సాగు చేసుకోవాలి. ఇవి 160 రోజుల పంటకాలం. నీటి వనరులు తక్కువగా ఉంటే 1224 రకం విత్తనాలతో జూలై 15 తర్వాత నారు పోసుకోవాలి. ఆర్ఎన్ఆర్ 1504ఏ సాగు చేసుకుంటే మంచిది. పంట కాలం 120 నుంచి 135 రోజులు ఉంటుంది.

ప్రశ్న: వరిసాగులో అధికంగా దుంప రావడం లేదు?
– పొన్నం సాయితేజ, చల్వాయి, గోవిందరావుపేట

జవాబు: వేసవిలో భూమి లోతుగా దుక్కులు చేసుకోవాలి. దీంతో పాటు భూమిలో పచ్చిరొట్ట, జనుము, జీలుగా వంటివి సాగు చేసుకొని పూతదశలో దుక్కిలో కలియ దున్నుకోవాలి. దీంతో భూమి గుల్లబారి మొక్కలకు పోషకాలు అంది సమర్థవంతంగా పిలుకలు వస్తాయి.

ప్రశ్న: వరి నాటు ఎప్పటి వరకు వేసుకోవచ్చు?
– బైకాని ప్రకాశ్, ములుగు

జవాబు: వరి నాట్లు జూలై చివరివారం వరకు వేసుకోవచ్చు. రైతులు సన్న రకాలను వేసుకుంటే లాభదాయకంగా ఉంటుంది. 1224, ఆర్ఎన్ఆర్ 1504ఏ రకాలు 125 రోజుల పంటకాలం ఉంటుంది. నీరు తక్కువగా ఉన్న ప్రాంతాల్లో సాగు చేసుకోవాలి. చెరువుల ద్వారా నీరు పారకం ఉంటే పంటకాలం అధికంగా ఉన్న 1264, 1282, వరంగల్ సన్నాలు, రామప్ప వంటి విత్తనాలు 160 రోజుల పంటకాలం ఉంటుంది. వరి కోతల సమయంలో ఇబ్బందులు తలెత్తకుండా ఉంటాయి. ఆర్ఎన్ఆర్ 1504ఏలో తెల్లకంకి ఎక్కువగా వస్తుంది. కాబట్టి నివారణ చర్యలుగా కాట్టాప్ హైడ్రో క్లోరైడ్‌ను వినియోగిస్తే తగ్గుతుంది.

ప్రశ్న: డ్రమ్ సీడర్ ద్వారా వరిసాగు చేస్తున్నాం.. కలుపు నివారణ చర్యలు తెలుపండి?
ప్రభాకర్, మచ్చాపూర్, గోవిందరావుపేట

జవాబు: డ్రమ్ సీడర్ ద్వారా వరిసాగు చేసే రైతులు కలుపు నివారణకు విత్తనాలు మొలకెత్తక ముందు 48 గంటల లోపు కలుపు నివారణకు పెండి మిథలిన్ మందు పిచికారీ చేయాలి. తర్వాత 20 నుంచి 25 రోజుల మధ్యలో మరోసారి బిస్‌పైర్‌బ్యాక్ సోడియం (నామినిగోల్డ్) పిచికారీ చేయాలి.

ప్రశ్న: భూసార పరీక్షలు ఎప్పుడు చేస్తారు?
– నరేందర్, నర్సింహసాగర్, మంగపేట

జవాబు: మంగపేట మండలంలో భూసార పరీక్షల నమూనాలు సేకరించాం. మండల వ్యవసాయ అధికారిని కలిసి భూసార పరీక్షలు చేయించుకోవచ్చు. భూమిలో పోషక లోపాలు ఉంటే పచ్చిరొట్ట సాగు చాలా మంచిది. దీంతో పోషకాలు పెరిగి పంట దిగుబడి అధికంగా వస్తుంది.

ప్రశ్న: వరిసాగులో మొగి పురుగు నివారణ చర్యలు తెలుపండి?
– అంతిరెడ్డి, చల్వాయి, గోవిందరావుపేట

జవాబు: వరిసాగులో రాగిగొట్టం నివారణకు నారు నాటు వేసుకునే సమయంలో కోరాజిన్ పిచికారీ చేసుకోవాలి. లేదా కార్టాఫ్‌హైడ్రోక్లోరైడ్ పిచికారీ చేసుకోవడం వల్ల నివారించవచ్చు. దీంతో పాటు చిరుపొట్ట దశలో కూడా కోరాజిన్ మందు పిచికారీ చేస్తే నివారణ జరుగుతుంది.

ప్రశ్న: మిరప సాగులో మేలైన విత్తనాలు తెలపండి?
– వనపర్తి భిక్షపతి, మల్లూరు, మంగపేట

జవాబు: మిరప సాగుకు ప్రైవేట్ కంపెనీల విత్తనాలు ఉంటాయి కాబట్టి రైతులు తమ అనుభవాలను బట్టి విత్తనాలను ఎంపిక చేసుకోవాలి. మన ప్రాంతంలో గతంలో అధిక దిగుబడిని ఇచ్చిన వాటిని ఎంపిక చేసుకుని సాగు చేసుకోవాలి. వేరుకుళ్ల నివారణ చర్యలు తీసుకోవాలి. పంట మార్పిడితో చీడపీడల సమస్యలను నివారించవచ్చు.

సాంకేతికతపై అవగాహన కల్పించాలి
- వీసీలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు


వీసీలో పాల్గొన్న కలెక్టర్, డీఏఓ

ములుగు: వ్యవసాయ రంగంలో నూతన సాంకేతిక పద్ధతులపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యవసాయశాఖ అధికారులను ఆదేశించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపితో కలిసి వ్యవసాయ రంగంలో రైతునేస్తం కార్యక్రమంపై కలెక్టర్లతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రైతు వేదిక నుంచి కలెక్టర్ ఇలా త్రిపాఠి, జిల్లా వ్యవసాయాధికారి విజయ్‌చంద్రతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో రైతులకు నూతన సాంకేతిక పద్ధతులపై అవగాహన కల్పించాలన్నారు. రాష్ట్రంలో ప్రతీ జిల్లా నుంచి రెండు రైతు వేదికలలో వీడియో కాన్ఫరెన్స్ హాళ్లను ప్రారంభించామని తెలిపారు. ప్రతీ మంగళవారం రైతు వేదికలో రైతులకు వ్యవసాయశాస్త్ర వేత్తలతో పంటల మార్పిడి, పంటలకు వచ్చే చీడ పీడలు, సేంద్రియ వ్యవసాయం తదితర అంశాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నూతన పంటలను సాగు చేసే రైతులతో స్థానిక ఆదర్శ రైతులతో వారి అనుభవాలను ఇతర రైతులకు తెలియజేసే కార్యక్రమాలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. రైతులు వ్యవసాయ సాగులో రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గిస్తూ సేంద్రియ ఎరువుల వినియోగంపై దృష్టి పెట్టాలన్నారు. అనంతరం కలెక్టర్ ఇలా త్రిపాఠి రైతులతో మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో వస్తున్న విప్లవాత్మక మార్పులు, ఆవిష్కరణలు క్షేత్ర స్థాయిలోకి తీసుకెళ్లేందుకు ప్రతీ మంగళవారం వ్యవసాయ అధికారులు రైతులతో రైతునేస్తం కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. ఈ మేరకు ప్రభుత్వం రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తుందని తెలిపారు. వ్యవసాయ రంగానికి సాంకేతికతను అనుసంధానం చేస్తూ రైతు సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వీసీలో ఏఓ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

తొలిరోజు సందడిగా..

- మొదటిరోజు కొత్తగా.. ముచ్చట్లతోనే గడుస్తుంది
- పాఠశాలల పునఃప్రారంభం నేపథ్యంలో ప్రముఖుల మనోగతం

ములుగు/ఏటూరునాగారం: వేసవి సెలవుల అనంతరం పాఠశాలల పునఃప్రారంభం రోజు అంతా సందడిగా ఉంటుంది. విద్యార్థులకు కొత్తకొత్తగా ఉంటుంది. మొదటిరోజు అంతా ముచ్చట్లతోనే గడుస్తుంది. ఉపాధ్యాయులు సైతం వేసవి సెలవులను ఎలా గడిపారని పిల్లలను ఆరాతీస్తారు. నేడు పాఠశాలల పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో జిల్లాలోని ఉన్నతాధికారులు తమ బాల్యం, పాఠశాలస్థాయి విద్య, ఆటపాటలు, అల్లరి, చదువుపై పెట్టిన శ్రద్ధను సాక్షితో పంచుకున్నారు.

నాన్నే నా తొలిగురువు..



నాకు ఊహ తెలిసినప్పటి నుంచి మా నాన్న అల్లెం లక్ష్మీనర్సయ్య నా తొలిగురువు. 1970లో మా స్వగ్రామం అంకన్నగూడెంలో బడి లేదు. నాన్న ఇంటివద్దనే నాకు ఫస్ట్ క్లాస్(పెద్దబాలశిక్ష) చదివించాడు. 1974లో గూడేనికి పక్కనే ఉన్న జగ్గన్నగూడెం పాఠశాలకు తీసుకెళ్లి జాయిన్ చేయించారు. తొలిసారి పాఠశాలకు వెళ్లడం మరిచిపోలేనే అనుభూతినివ్వడంతో పాటు సందడిగా గడిచింది. కొత్త మిత్రులను కలవడం ఆనందాన్ని కలిగించింది. ఉపాధ్యాయుడు కొమురం పొట్టయ్య బడి అయిపోయిన తర్వాత గాలపేట(గాలాలతో చేపలు పట్టేవాళ్లం) ఆడేవాళ్లం.. అది మరచిపోలేని ఘటన. 1976–77లో నాల్గో తరగతి చదువుకోవడానికి రాయినిగూడెం ఆశ్రమ పాఠశాలలో చేర్చారు. ఆ కాలంలో విద్యుత్, రోడ్డు సౌకర్యాలు లేవు. సెలవుల్లో ఇంటికి వెళ్లడానికి ఆరు కిలోమీటర్లు వెళ్లేవాళ్లం. వాగు వస్తే ఈదుకుంటూ వెళ్లేవాళ్లం. ఏదైనా పాఠశాలలో చేరిన తొలినాటి అనుభవం మధురానుభూతినిస్తుంది. ఆ జ్ఞాపకాలు ఇప్పటికీ కళ్లముందే ఉన్నట్లుగా అనిపిస్తాయి.

- అల్లెం అప్పయ్య, డీఎంహెచ్ఓ

ఈ స్థాయిలో ఉండడానికి కారణం బాబాయి నెహ్రూనాయక్



మాది రాంనాయక్‌తండా. పక్కనే ఉన్న గుర్రంపేట పాఠశాలలో అ..ఆ లు నేర్చుకున్నా. తొలిరోజు మా అమ్మ పోరిక రాధమ్మ పట్టుబట్టి పాఠశాలకు తీసుకవెళ్లింది. తండాకు..గుర్రంపేట పాఠశాల మధ్యలో పెద్ద చెరువు వాగు ఉండేది. వర్షాలు కురుస్తున్నా లెక్కచేయకుండా తీసుకెళ్లి నన్ను చదివించాలని చూసింది. పాఠశాలలో చేరిన తర్వాత తెలుగు ఉపాధ్యాయుడు లక్ష్మయ్య స్ఫూర్తితో తెలుగు స్పష్టంగా నేర్చుకున్నా.. ప్రస్తుతం నేను ఈ స్థాయిలో ఉండడానికి మా బాబాయి న్యాయవాది నెహ్రూనాయక్ ప్రధాన కారణం. 1988 సంవత్సరంలో తండా నుంచి నలుగురం బాల్యస్నేహితులం కలిసి వెళ్లే వాళ్లం. నేటికి స్నేహితులు కలిసినప్పుడల్లా పాఠశాల గురించి, అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఉంటాం.

- పోరిక రవీందర్,
టీబీ, లెప్రసి, హెచ్‌ఐవీ ప్రోగ్రాం అధికారి

బీంపూర్ స్కూల్‌కు రుణపడి ఉంటా..



ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరు తాలుకలో ఉన్న బీంపూర్ గ్రామంలో పదో తరగతి వరకు చదువుకున్నా. ఆ స్కూల్‌కు రుణపడి ఉంటా. మాది ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరు. జిల్లా పరిషత్‌లో పాఠశాలలో చదివేందుకు మా అమ్మమ్మ వాళ్లతో కలిసి బీంపూర్ వెళ్లాను. మా మేనమామ పవర్ గంగారం నన్ను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 6వ తరగతిలో చేర్పించారు. అప్పటి హెచ్ఎం శ్రావణ్‌మాస్టర్ ఆడ్మిషన్ చేసుకొని విద్యాబుద్ధులు నేర్పారు. 1980–81లో పదో తరగతి పూర్తి అయ్యింది. ఇప్పుడు ఐటీడీఏలో ఏపీఓ జనరల్ స్థాయిలో ఉద్యోగం చేస్తున్నాను. తన బంగారు భవిష్యత్‌కు బాటలు వేసిన ఉపాధ్యాయుల కృషి ఎన్నటికి మరువలేనిది. నేను చదువుకున్న బీంపూర్ స్కూల్‌కు రుణపడి ఉంటాను.

- వసంతరావు జాదవ్,
ఐటీడీఏ ఏపీఓ జనరల్, ఏటూరునాగారం

'భూమి దక్కేవరకు అండగా ఉంటాం'

వెంకటాపురం(కె): కొమురంభీం కాలనీ ఆదివాసీలకు సాగులో ఉన్న భూమి దక్కే వరకు వారికి అండగా ఉంటామని ఆదివాసీ నవ నిర్మాణ సేవ రాష్ట్ర అధ్యక్షుడు కోర్సా నర్సింహమూర్తి అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం గోండ్వానా సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో ఆదివాసీల భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలని చేపట్టిన రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని ఆయన సందర్శించి ప్రారంభించి సంఘీభావం ప్రకటించి మాట్లాడారు. ఆదివాసీలు చేస్తున్న పోరాటం న్యాయమైందని తెలిపారు.

బడికి వేళాయె..


బడిబాటలో పాల్గొన్న అదనపు కలెక్టర్ శ్రీజ

నేటి నుంచి పాఠశాలలు పునః ప్రారంభం
- అసంపూర్తిగా అమ్మ ఆదర్శ పాఠశాలలు
- కొనసాగుతున్న బడిబాట కార్యక్రమం

ములుగు: ఏప్రిల్ 23వ తేదీ నుంచి జూన్ 11వ తేదీ వరకు వేసవి సెలవుల్లో ఆటపాటలు, శిక్షణ శిబిరాలు, సమ్మర్ టూర్లలో మునిగితేలిన విద్యార్థులు పుస్తకాలతో కుస్తీ పట్టే సమయం ఆసన్నమైంది. వేసవి సెలవుల అనంతరం 45 రోజుల తర్వాత విద్యాశాఖ ఆదేశాలకు అనుగుణంగా జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు నేటి(బుధవారం) నుంచి పునఃప్రారంభం కానున్నాయి. ఈ మేరకు 2024–2025 నూతన విద్యా సంవత్సరానికి జిల్లా విద్యాశాఖ తగిన ప్రణాళికను సిద్ధం చేసింది.

విద్యార్థుల సంఖ్య పెరిగేలా చర్యలు

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేటు దీటుగా విద్యార్థుల సంఖ్యను పెంచడానికి ఈ నెల 6వ తేదీ నుంచి 19వ తేదీ వరకు విద్యాశాఖ గ్రామాల వారీగా బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న ఆంగ్ల మాధ్యమం, 10వ తరగతి ఫలితాల్లో సాధించిన మార్కులను వివరిస్తూ తల్లిదండ్రులను ఆకర్షించే ప్రయత్నాలు చేస్తున్నారు. జిల్లాలో ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ, హైస్కూల్(అన్ని శాఖలు) 552 పాఠశాలలు ఉండగా గత విద్యాసంవత్సరం వరకు 39,132 మంది విద్యార్థులు ఉన్నారు. వీరిలో ప్రస్తుతానికి ప్రైవేట్, ప్రభుత్వ గురుకులాల ప్రవేశాలకు సుమారు 1,500 నుంచి 2వేల మంది వెళ్లే అవకాశం ఉంది. ఆ సంఖ్యను మినహాయించి ఈ ఏడాది విద్యార్థుల సంఖ్యను 45వేల వరకు పెంచే విధంగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

పలు పాఠశాలల్లో నిలిచిన పనులు

ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి పనులు చేపట్టడానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం మన ఊరు–మన బడి పేరుతో జిల్లాలో 125 ఎంపిక చేసింది. ఇందులో 98 పాఠశాలల్లో పనులు పూర్తయ్యాయి. మిగితా పాఠశాలల్లో చేసిన పనికి బిల్లులు రాలేదని కాంట్రాక్టర్లు పనులను మధ్యలోనే వదిలేశారు. చాలా వరకు పాఠశాలల్లో మరుగుదొడ్లు, పెయింటింగ్ పనులు నిలిచిపోయాయి. మన ఊరు–మన బడి పనులతో సంబంధం లేకుండా నూతన ప్రభుత్వం జిల్లాలోని ప్రభుత్వ, లోకల్ బాడీ, కేజీబీవీ, టీఎస్ఎంఎస్, టీఎస్ఆర్ఈఐఎస్ మేనేజ్‌మెంట్ పాఠశాలల పరిధిలో 367 పాఠశాలలను ఎంపిక చేసింది. పనుల నిర్వహణకు అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ(ఏఏపీసీ)లను నూతనంగా నియమించి విద్యార్థులకు అనుగుణంగా మౌలిక సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం 6.91కోట్లతో అభివృద్ధి పనులను మొదలుపెట్టింది. మైదాన ప్రాంత పాఠశాలలతో పాటు ఐటీడీఏ పరిధిలోని 99ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలల్లో సైతం పనులు జరుగుతున్నాయి. అయితే వీటిలో అధికారికంగా ఇప్పటి వరకు కేవలం 256 పాఠశాలల్లో మాత్రమే పనులు జరిగాయి. 79 పాఠశాలల్లో పనులు అసంపూర్తిగా ఉన్నాయి. ఆయా కారణాలతో 32 పాఠశాలల్లో పనులు మొదలు కాలేదు. అభివృద్ధి పనులతో పాటు పాఠశాలలకు 6,248 డ్యూయల్ డెస్కులు, 449 గ్రీన్ చాక్ బోర్డుల సరఫరాను పూర్తి చేయాలి. జూన్ 11వ తేదీలోగా భవనాలకు పెయింటింగ్ వేయాలి. కానీ క్షేత్ర స్థాయిలో అలాంటి ఏర్పాట్లు లేవు. దీంతో పాఠశాలల్లో అడుగుపెట్టనున్న విద్యార్థులకు పాఠశాలలు సమస్యలతో స్వాగతం పలకనున్నాయి.

పాఠశాలల వివరాలు

ప్రైమరీ పాఠశాలలు	372
అప్పర్ ప్రైమరీ పాఠశాలలు	68
హైస్కూల్స్	112
విద్యార్థుల సంఖ్య	(2023-2024)
ప్రైమరీ పాఠశాలల్లో	11,138
అప్పర్ ప్రైమరీ పాఠశాలల్లో	4,828
హైస్కూల్స్‌లో (9వ తరగతి వరకు)	23,166

పూర్తిగా అందని పుస్తకాలు, యూనిఫాంలు

గతంలో జరిగిన తప్పిదాలు పునరావృతం కాకుండా ఈ ఏడాది పాఠశాలల పునఃప్రారంభం రోజే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు అందించాలని ప్రభుత్వం సంకల్పించింది. సంక్షేమ గురుకులాలు మినహాయిస్తే సుమారు 22వేల మంది విద్యార్థులు ఉన్నారు. ఇందులో కేవలం 19,645 మందికి అవసరమైన ఏకరూప యూనిఫాంలకు సంబంధించిన దుస్తులను సేకరించి ఎస్‌హెచ్‌జీ కమిటీల ద్వారా కుట్టు పనులు పూర్తి చేశారు. జిల్లా వ్యాప్తంగా 1,71,150 ఉచిత పాఠ్యపుస్తకాలకు గాను ఇప్పటి వరకు 1,42,510 పుస్తకాలు మాత్రమే స్టోరేజ్ పాయింట్ నుంచి మండల విద్యావనరుల కేంద్రానికి చేరుకున్నాయి. వీటితో పాటు 95,913 ఉచిత నోట్ పుస్తకాలు మాత్రమే వచ్చాయి. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా రెండవ విడతకు ఇండెంట్ పెట్టినట్లుగా విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు.

విద్యా సంవత్సరాన్ని ఘనంగా ప్రారంభిస్తాం..



నూతన విద్యా సంవత్సరాన్ని ఘనంగా ప్రారంభించేలా ఏర్పాట్లు చేస్తున్నాం. జిల్లాలోని ఆయా ప్రభుత్వ పాఠశాలల హెచ్ఎంలకు మౌఖిక ఆదేశాలు జారీ చేశాం. తొలిరోజు మామిడి తోరణాలు, బంతిపూలు, బెలూన్లతో రంగరించి విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజాప్రతినిధులను ఆహ్వానం పలకనున్నాం. విద్యార్థులకు అవసరమైన పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్కులు, యూనిఫాంలు సిద్ధంగా ఉన్నాయి. పాఠశాల ఆవరణలో పెరిగిన పిచ్చి మొక్కలు, గడ్డిని తొలగించడానికి గ్రామ పంచాయతీ సిబ్బంది సహాయం తీసుకొని విద్యార్థులు వచ్చేలోపు శుభ్రంగా ఉంచాలని ఉపాధ్యాయులకు సూచనలు చేశాం. బడిబాట కార్యక్రమానికి మంచి స్పందన వస్తుంది. కలెక్టర్ ఇలా త్రిపాఠి, అడిషనల్ కలెక్టర్ శ్రీజ అండగా ఉంటూ తమతో పాటు బడిబాటలో పాల్గొంటున్నారు.

- పాణిని, జిల్లా విద్యాశాఖ అధికారి

క్లుప్తంగా

బీఆర్ఎస్‌లో 'పాడి' ఐరన్‌లెగ్

- పాస్ రాష్ట్ర అధ్యక్షుడు సంగాని మల్లేశ్వర్



మాట్లాడుతున్న మల్లేశ్వర్

కేయూ క్యాంపస్: బీఆర్ఎస్‌లో హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ ఐరన్ లెగ్ అని పూలే ఆశయ సాధన సమితి (పాస్) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సంగాని మల్లేశ్వర్ అన్నారు. మంగళవారం కాకతీయ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ఆవిర్భావం నుంచి పార్టీలో పనిచేసిన కార్యకర్తలను పక్కన పెట్టి హుజూరాబాద్‌లో పాడికౌశిక్‌కు అవకాశం ఇచ్చారని, చావు తప్పి కన్ను లొట్టబోయినట్లు గెలిచిన ఆయన.. పార్లమెంట్‌లో కొట్లాడి తెలంగాణ తెచ్చిన బీసీ బిడ్డ పొన్నం ప్రభాకర్‌పై నిరాధర ఆరోపణలు చేయడం శోచనీయమన్నారు. పొన్నం ప్రభాకర్ ఎదుగుదల ఓర్వలేకే ఎమ్మెల్యే కౌశిక్ విమర్శలకు దిగుతున్నారని మండిపడ్డారు. ఐరన్ లెగ్ నాయకుల వల్ల ఇప్పటికే బీసీలు దూరమై అధికారం కోల్పోయిన కేసీఆర్ స్థాపించిన పార్టీ ఎగ్జిట్‌అయ్యే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. సమావేశంలో పాస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ చందా మల్లయ్య, బాధ్యులు బూర విద్యాసాగర్, మెరుగు బాబుయాదవ్, నల్లాని శ్రీనివాస్, వంగల సుధాకర్ పాల్గొన్నారు.

రైలునుంచి జారి పడి యువకుడి మృతి

- నెక్కొండ, ఎల్గూరు రైల్వే స్టేషన్ల మధ్య ఘటన



సందీప్ (ఫైల్)

కాశిబుగ్గ: రైలునుంచి జారి పడి ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన వరంగల్ జిల్లా నెక్కొండ, ఎల్గూరు రైల్వేస్టేషన్ల మధ్య చోటు చేసుకుంది. జీఆర్పీ సీఐ నరేశ్ కథనం ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు మండలం నెహ్రూ నగర్‌కు చెందిన ధనసరి సందీప్(25) హైదరాబాద్‌లో కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవల ఇంటికి వచ్చాడు. మంగళవారం తన మిత్రుడు మూతి రాజశేఖర్‌తో కలిసి సికింద్రాబాద్ వెళ్లేందుకు మహబూబాబాద్‌లో షిర్డీ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కాడు. ఈ క్రమంలో నెక్కొండ, ఎల్గూరు రైల్వే స్టేషన్ల మధ్య రైలునుంచి జారిపడడంతో సందీప్ తల పగిలి మెదడు చిట్లిపోయింది. కాళ్లు, చేతులు విరిగి డౌన్ లైన్ ట్రాక్ మధ్యలో పడి మృతి చెందాడు. ఈ ఘటనపై డిప్యూటీ ఎస్ఎస్ ఫిర్యాదు మేరకు హెడ్‌కానిస్టేబుల్ జి.సుదర్శన్ కేసు నమోదు చేసి మృతదేహాన్ని వరంగల్ ఎంజీఎం మార్చురీలో భద్రపరచామని సీఐ నరేశ్ తెలిపారు. మృతుడి స్నేహితుడి వద్ద లభించిన ఆధారాల ద్వారా కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చినట్లు చెప్పారు

రిజిస్ట్రేషన్ శాఖలో బదిలీలు?



వారం రోజుల్లో వెలువడనున్న ఉత్తర్వులు

- జిల్లా రిజిస్ట్రార్ నుంచి క్లర్క్ వరకు స్థానచలనం..
- సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో హాట్‌టాపిక్
- వరంగల్ ఆర్వోపై పలువురి నజర్
- జీరో లేదా లాంగ్ స్టాండింగ్ ట్రాన్స్‌ఫర్స్

కాజీపేట అర్బన్ : రిజిస్ట్రేషన్ శాఖలో జిల్లా రిజిస్ట్రార్ నుంచి కిందిస్థాయి అధికారుల వరకు త్వరలో బదిలీలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఉమ్మడి వరంగల్‌లో గత ప్రభుత్వం చేపట్టిన 317 జీఓ ఆధారంగా జోన్‌ల వారీగానా లేదా ఉమ్మడి వరంగల్ జోన్‌ను భిన్నంగా చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు విశ్వసనీయ సమాచారం. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరుణంలోనే బదిలీలపై కసరత్తు చేయగా ఎన్నికల కోడ్‌తో బ్రేక్ పడింది. ఇటీవల కోడ్ ముగియడంతో వారం రోజుల్లో బదిలీ ఉత్తర్వులను ప్రభుత్వం జారీ చేసే అవకాశం ఉంది. ఈ విషయం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో హాట్‌టాపిక్‌గా మారింది.

ఉమ్మడి వరంగల్‌లో 105 మంది ఉద్యోగులు

ఉమ్మడి వరంగల్‌లోని 13 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలతోపాటు డీఐజీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న 16 మంది సబ్ రిజిస్ట్రార్లు 2021లో 317 జీఓ ఆధారంగా జోన్ బదిలీల్లో విధుల్లో చేరారు. సాధారణ బదిలీల్లో 2022లో మరి కొందరు బదిలీ అయ్యారు. వీరితోపాటు 2021లో జిల్లా రిజిస్ట్రార్ బదిలీపై వచ్చారు. వరంగల్ ఆర్వో, వరంగల్ ఫోర్ట్, వరంగల్ రూరల్, మహబూబాబాద్, స్టేషన్ ఘన్‌పూర్, జనగామ, భీమదేవరపల్లి, పరకాల, నర్సంపేట, ములుగు, భూపాలపల్లి, కొడకండ్ల, వర్ధన్నపేటల్లో 13మంది సబ్ రిజిస్ట్రార్లు, డీఐజీ కార్యాలయంలో ఒక సబ్ రిజిస్ట్రార్‌స్థాయి అధికారి, చిట్స్ సహాయ రిజిస్ట్రార్, ఆడిట్ విభాగంలో ఒక్కొక్క సబ్ రిజిస్ట్రార్ స్థాయి అధికారులు, 14 మంది సీనియర్ అసిస్టెంట్లు, 39 మంది జూనియర్ అసిస్టెంట్లు, వరంగల్ ఆర్వోలో 20 మంది క్లర్క్‌స్థాయి కార్యాలయ సిబ్బంది తోపాటు 16 మందికిందిస్థాయి ఉద్యోగులు బదిలీ అయ్యే అవకాశం ఉంది.

జీరో లేదా లాంగ్ స్టాండింగ్..

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తున్న జిల్లా రిజిస్ట్రార్ నుంచి క్లర్క్ స్థాయి వారికి జీరో ట్రాన్స్‌ఫర్స్ లేదా లాంగ్ స్టాండింగ్ ట్రాన్స్‌ఫర్స్ ప్రక్రియను చేపట్టేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. జీరో ట్రాన్స్‌ఫర్స్ అయితే ఏకకాలంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 105 మంది ఉద్యోగులు, జిల్లా రిజిస్ట్రార్‌తో సహా స్థాన చలనం తప్పదు.

317 జీఓ లేదా ఉమ్మడి వరంగల్ జోన్..

గత ప్రభుత్వం తీసుకొచ్చిన 317 జీఓ ఆధారంగా జోన్‌ల వారీగా బదిలీలు చేపట్టారు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం జోన్‌ల వారీగా 317 జీఓ ఆధారంగా కాకుండా ఉమ్మడి వరంగల్ జోన్ వారీగా బదిలీలు చేపట్టే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. జోన్-1లో జిల్లా రిజిస్ట్రార్‌తోపాటు గ్రేడ్-1 అధికారులను, జోన్-4లో మిగతా ఉద్యోగులకు బదిలీ చేస్తారు.

వరంగల్ ఆర్వోపై నజర్..

ఉమ్మడి జిల్లాలోని వరంగల్ ఆర్వో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలపై కరీంనగర్, నిజామాబాద్‌కు చెందిన జిల్లా రిజిస్ట్రార్ స్థాయి అధికారులు, సబ్ రిజిస్ట్రార్లు నజర్ వేసినట్లు తెలుస్తోంది. ఈ మేరకు వారు ఇక్కడికి వచ్చేందుకు పావులు కదుపుతున్నట్లు సమాచారం. ఇక్కడ భూముల రేట్లు విపరీతంగా ఉండడం, ఆదాయం వచ్చే ప్రాంతం కావడంతో ఆర్వో, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో విధులు నిర్వహించేందుకు అధికారులు ఆసక్తి కనబరుస్తుండడం గమనార్హం.

అపరాల సాగు లాభదాయకం

- వ్యవసాయ పరిశోధన స్థానం సహ పరిశోధన సంచాలకుడు ఉమారెడ్డి



రైతులకు కంది విత్తనాలు అందజేస్తున్న ఉమారెడ్డి

హన్మకొండ: అపరాల సాగు రైతులకు లాభదాయకమని, ఈ పంటకు డిమాండ్ ఉందని వరంగల్ వ్యవసాయ పరిశోధన స్థానం సహ పరిశోధన సంచాలకుడు డాక్టర్ ఆర్.ఉమారెడ్డి అన్నారు. అఖిల భారత సమన్వయ పరిశోధన పథకం- కంది, వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఆధ్వర్యంలో కంది పంట ప్రథమ శ్రేణి ప్రదర్శన క్షేత్రాల సాగు చేయనున్నారు. ఇందులో భాగంగా మంగళవారం కంది ప్రదర్శన క్షేత్రాల రైతుల అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సులో ఉమారెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో వరి, పత్తి తర్వాత విస్తీర్ణంలో అతిపెద్ద పంటగా కంది చోటు చేసుకోబోతుందన్నారు. అయితే అపరాల సాగు విస్తీర్ణం పెంచాల్సిన అవసరం చాలా ఉందన్నారు. కందితో కూడా వాణిజ్య పంటలతో సమానంగా నికర ఆదాయం పొందొచ్చన్నారు. శాస్త్రవేత్త, అపరాల విభాగాధిపతి డా.ఎన్. సంధ్యాకిశోర్ మాట్లాడుతూ అపరాల పంటైన కందిని రాష్ట్రంలో 2023 సంవత్సరంలో 4.7 లక్షల ఎకరాలలో సాగు చేశారన్నారు. ఈ సంవత్సరం (2024)లో 8-10 లక్షల ఎకరాలకు పెంచాలన్నారు. వరంగల్ వ్యవసాయ పరిశోధన స్థానం నుంచి నూతనంగా డబ్ల్యూ.ఆర్.జి.ఇ-97 (వరంగల్ కంది-1), డబ్ల్యూ.ఆర్.జి.ఇ-93 (తెలంగాణ కంది-1), డబ్ల్యూ.ఆర్.జి.ఇ-121, డబ్ల్యూ.ఆర్.జి -255 కంది రకాలు విడుదలయ్యాయన్నారు. ఎఫ్.ఎల్.డి. ఇన్‌చార్జ్, శాస్త్రవేత్త మధు.. నేలలు, విత్తన మోతాదు, విత్తే విధానం, కలుపు, ఎరువుల యాజమాన్యంపై వివరించారు. కంది పంటను ఆశించే వివిధ రకాల పురుగులు, వాటి యాజమాన్యం గురించి డాక్టర్ డి.వీరన్న, డాక్టర్.జి. పద్మజ వివరించారు. ఈ సందర్భంగా రైతులకు కంది విత్తనాలు, రైజోబియం, ట్రైకోడెర్మా ప్యాకెట్లను ఉమారెడ్డి, శాస్త్రవేత్తలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వరంగల్ జిల్లా గీసుకొండ, హనుమకొండ జిల్లా హసన్‌పర్తి, జయశంకర్ భూపాలపల్లి టేకుమట్ల, జనగామ జిల్లా జఫర్‌గడ్ మండలం, మహబూబాబాద్ జిల్లాలకు చెందిన 70 మంది రైతులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని రైతు దుర్మరణం

- పసరగొండ వద్ద ఘటన



బుచ్చిరెడ్డి(ఫైల్)

దామెర: అజాగ్రత్త, అతివేగం.. ఒకరిని బలితీసుకుంది. లారీ ఢీకొని ఓ రైతు దుర్మరణం చెందాడు. ఈ ఘటన హనుమకొండ జిల్లా దామెర మండలం పసరగొండ క్రాస్ వద్ద చోటుచేసుకుంది. ఎస్సై కొంక అశోక్ కథనం ప్రకారం.. ఊరుగొండకు చెందిన రైతు మన్నెం బుచ్చిరెడ్డి(64) మంగళవారం యూరియా బస్తాను తన ద్విచక్ర వాహనంపై తీసుకుని వ్యవసాయ బావివద్దకు వెళుతున్నాడు. ఈ క్రమంలో పసరగొండ క్రాస్ వద్ద జాతీయ రహదారిని దాటేక్రమంలో వాహనాలను గమనించి డివైడర్ వద్ద తన ద్విచక్రవాహనం నిలిపాడు. ఈ క్రమంలో పరకాల నుంచి హనుమకొండ వైపునకు వెళ్తున్న ఏపీ 16 టీ 0879 నంబర్ గల లారీ వేగంగా వచ్చి బుచ్చిరెడ్డి ద్విచక్రవాహనాన్ని ఢీకొని డివైడర్‌పైకి దూసుకెళ్లింది. దీంతో తీవ్రగాయాలతో బుచ్చిరెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై బుచ్చిరెడ్డి భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా, లారీ డ్రైవర్ మద్యం సేవించి ఉన్నట్లు పలువురు స్థానికులు చర్చించుకుంటున్నారు.

నాటకాలు యదార్ధ జీవితాలకు ప్రతిబింబాలు

- కేంద్ర ఖాదీ చిన్న పరిశ్రమల మాజీ డైరెక్టర్ ఈగ మల్లేశం
- ముగిసిన ఆహ్వాన తెలుగు నాటక పోటీలు




నిశ్శబ్దమా.. నీ ఖరీదెంత? నాటక ప్రదర్శన

హన్మకొండ కల్చరల్ : నాటకాలు యదార్థజీవితాలకు ప్రతిబింబాలని, డిజిటల్ మీడియా ప్రభావంతో ప్రేక్షకుల ఆదరణ తక్కువైనా నాటకాలు ప్రదర్శిస్తూ ప్రజలను చైతన్యపరుస్తున్న కళాకారులను ప్రోత్సహించాలని కేంద్ర ఖాదీ చిన్న పరిశ్రమల మాజీ డైరెక్టర్ , ప్రముఖ రాజకీయవేత్త ఈగ మల్లేశం అన్నారు. ఐక్యవేదిక ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరిగిన 15వ ఉభయ రాష్ట్రస్థాయి ఆహ్వాన తెలుగు నాటక పోటీలు ముగిశాయి. వరంగల్ పోతన విజ్ఞానపీఠం ఆడిటోరియంలో మంగళవారం సాయంత్రం ఐక్య వేదిక అధ్యక్షుడు కాజీపేట తిరుమలయ్య అధ్యక్షతన జరిగిన సభలో ఈగ మల్లేశం, వనం లక్ష్మీకాంతారావు, బోయినపల్లి పురుషోత్తంరావు, వడ్డెపల్లి నర్సింగరావు, నాగపురి సంజయ్ అతిథులుగా పాల్గొని జ్యోతిప్రజ్వలన చేసి నాటక పోటీలు ప్రారంభించారు. అనంతరం విశాఖపట్నంకు చెందిన 'మా తెలుగు కళాసమితి' వారు ప్రదర్శించిన 'నిశ్శబ్దమా... నీ ఖరీదెంత? నాటక ప్రదర్శన, వరంగల్‌కు చెందిన మయూరి ఆర్ట్ క్రియేషన్స్ వారు ప్రదర్శించిన ' ఉన్నది ఒక్కటే జీవితం! నాటక ప్రదర్శన అలరించాయి. ఈ సందర్భంగా వరంగల్ ఓరుగల్లు శారద నాట్యమండలి అధ్యక్షుడు, పద్యనాటక కళాకారుడు జీఎస్ శర్మను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కేయూ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ బన్న అయిలయ్య, మైక్రో ఆర్టిస్ట్ మట్టెవాడ అజయ్‌కుమార్, వేదిక ప్రధానకార్యదర్శి ఎస్ఎస్ఆర్ మూర్తి, కార్యవర్గ సభ్యులు మాలి విజయరాజ్, కళారాజేశ్వరరావు, వేముల ప్రభాకర్, జీఎస్ శర్మ, లక్ష్మణ్, సాదుల సురేశ్, కుసుమ సుధాకర్, జూలూరు నాగరాజు, ఆకుల సదానందం, చంద్రశేఖర్‌గౌడ్, పందిళ్ల అశోక్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక కారణాలతో ఇద్దరి ఆత్మహత్య

ఆర్థిక కారణాలతో మనస్తాపం చెందిన ఇద్దరు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం నిడిగొండలో రైలు కిందపడి యువకుడు,(మంచిర్యాల జిల్లా వాసి) భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం కనిపర్తిలో రైతు బలవన్మరణానికి పాల్పడ్డారు. దీంతో ఆయా కుటుంబాల్లో తీరని విషాదం నెలకొంది.



శ్రీనివాస్ (ఫైల్)

రేగొండ: అప్పుల బాధతో ఓ రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని కనిపర్తిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన శ్రీపతి శ్రీనివాస్ (49) తనకున్న భూమిలో మిర్చి పంట సాగు చేశాడు. పంట ఆశించిన దిగుబడి రాకపోవడంతో పెట్టుబడి, కుటుంబ అవసరాలకు తెచ్చిన అప్పులు అధికమయ్యాయి. దీంతో కొంతకాలంగా మనస్తాపం చెందుతున్న శ్రీనివాస్ ఈ నెల 10న ఉదయం తన చేను వద్ద పురుగుల మందు తాగాడు. స్థానికులు గమనించి కుటుంబీకులకు సమాచారం అందించడంతో వారు ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి భార్య లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నిడిగొండలో యువకుడు..



రవికుమార్ (ఫైల్)

రఘునాథపల్లి: ఆర్థిక ఇబ్బందులతో ఓ యువకుడు జీవితంపై విరక్తి చెంది రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన జనగామ జిల్లా రఘునాథపల్లి మండల నిడిగొండ రైల్వే గేట్ సమీపంలోని ట్రాక్‌పై చోటు చేసుకుంది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. మంచిర్యాల జిల్లా నస్పూర్ మండల కేంద్రంలోని అంబేడ్కర్ కాలనీకి చెందిన సుర రవికుమార్ (31) హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. వేతనం సరిపోక కొన్నాళ్లుగా ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపం చెందుతున్నాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెందిన రవికుమార్.. మంగళవారం ఉదయం నిడిగొండ రైల్వే గేట్ సమీపంలోని ట్రాక్‌పై గుర్తుతెలియని రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలిని పరిశీలించారు. మృతదేహం నుజ్జునుజ్జు కావడంతో ఆధార్ కార్డు ఆధారంగా గుర్తించి కుటుంబీకులకు సమాచారమిచ్చారు. మృతదేహాన్ని జనగామ ఏరియా ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబీకులకు అప్పగించారు. మృతుడి సోదరుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ రమణారెడ్డి, కానిస్టేబుల్ నరేశ్ తెలిపారు.

ఏపీఈఏపీసెట్‌లో మెరిసిన సుశాంత్

- స్టేట్ 9 ర్యాంకు సాధించిన వరంగల్ ఆణిముత్యం
- తల్లిదండ్రులు, బంధువులు, స్నేహితుల హర్షం
- ఐఏఎస్ కావడమే లక్ష్యం : సుశాంత్



సుశాంత్‌కు స్వీట్ తినిపిస్తున్న తల్లిదండ్రులు

కేయూ క్యాంపస్: ప్రతిష్టాత్మక ఏపీఈఏపీ (ఏపీఎంసెట్) సెట్ ఫలితాల్లో వరంగల్ ఆణిముత్యం హనుమకొండ రాంనగర్‌కు చెందిన పరమారాధ్యుల సుశాంత్ మెరిశాడు. స్టేట్ 9వ ర్యాంకు సాధించాడు. దీంతో తల్లిదండ్రులు, బంధువులు, స్నేహితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సుశాంత్.. ఇప్పటికే తెలంగాణ ఈఏప్‌సెట్‌లో 54వ ర్యాంకు సాధించాడు. అంతేకాకుండా ఇటీవల విడుదలైన జేఈఈ అడ్వాన్స్‌డ్ ప్రవేశాల్లో ఆల్‌ఇండియాలో 265వ ర్యాంకు, ఓబీసీ కేటగిరీలో ఆల్‌ఇండియాలో 31వ ర్యాంకు సాధించాడు. తాజాగా మంగళవారం వెలువడిన ఏపీఈఏపీసెట్ ఫలితాల్లో ఏకంగా 9వ ర్యాంకు సాధించాడు. ఈ సందర్భంగా సుశాంత్ మాట్లాడుతూ జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో వచ్చిన ర్యాంకుతో తనకు ముంబాయిలోని ఐఐటీలో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్‌లో సీటు వస్తుందన్నారు. కంప్యూటర్ సైన్స్ కోర్సు పూర్తయిన అనంతరం సివిల్స్‌కు సన్నద్ధమవుతానన్నారు. ఐఏఎస్ కావడమే తన లక్ష్యమన్నారు. కాగా, సుశాంత్ తండ్రి పరమారాధ్యుల సుధాకర్ వరంగల్ జిల్లా సంగెం మండలం తిమ్మాపురం జెడ్పీహెచ్ఎస్‌లో స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. తల్లి శివకుమారి జనగామ జిల్లా నర్మెట మండలం గండిరామవరంలో ఎస్‌జీటీగా విధులు నిర్వర్తిస్తోంది. తమ కుమారుడు ఏపీఈఏపీసెట్‌లో 9వర్యాంకు సాధించడంపై వారు సంతోషం వ్యక్తం చేశారు. సుశాంత్ రోజుకు 12 గంటలు చదువుతాడని తెలిపారు.

ప్రైమరీ నుంచి చదువులో ప్రతిభ

- 7వ తరగతి నుంచి నారాయణ విద్యాసంస్థల్లో ఉచిత విద్యనే..
- 1 నుంచి 5 వరకు హనుమకొండలో మాంటిసోరి స్కూల్‌లో చదివిన సుశాంత్.. 6వతరగతి హనుమకొండలో శ్రీచైతన్యలో చదివాడు. చిన్నప్పటి నుంచే సుశాంత్ చదువులో ప్రతిభను కనబర్చేవాడు. 7వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు హైదరాబాద్‌లోని నారాయణ విద్యాసంస్థల్లో చదివాడు. సుశాంత్ ప్రతిభను గుర్తించి కళాశాల యాజమాన్యం 7వతరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకూ ఉచితంగా విద్యనందించినట్లు సుశాంత్ తండ్రి సుధాకర్ తెలిపారు.
- సుశాంత్‌కు టెన్త్‌లో 9.8 జీపీఏ రాగా ఇంటర్మీడియట్‌లో ఎంపీసీలో 1000 మార్కులకు 974 మార్కులు (97.4శాతం)సాధించాడు.

మహిళా సమస్యల పరిష్కారానికి కృషి

- వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య
- నర్సంపేటలో రాష్ట్రస్థాయి సదస్సు



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

నర్సంపేట : మహిళా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని, ఇందులోభాగంగా మహిళా పోలీస్‌స్టేషన్ విభాగాలు ఏర్పాటు చేశామని వరంగల్ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. నర్సంపేట పట్టణంలోని రైతు వేదికలో తెలంగాణ రాష్ట్ర సీనియర్ సిటిజన్ కన్ఫెడరేషన్ నర్సంపేట వయో వృద్ధుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రంలో 'మహిళలు -స్థితిగతులు' అనే అంశంపై మంగళవారం రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మహిళల బాధ్యతలు, హక్కులపై వివరించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా పిల్లలకు బాధ్యతలు గుర్తు చేస్తూ వయోవృద్ధులు ఆదర్శంగా ఉండాలన్నారు. సీనియర్ సిటిజన్స్ సహకారాలు తీసుకుంటూ వారికి కావాల్సిన పనులు ప్రభుత్వ పరంగా చేస్తామన్నారు. రాష్ట్ర మహిళ సదస్సు నర్సంపేటలో నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి ఉషాదయళ్, జిల్లా సంక్షేమ అధికారి హైమావతి, ఆర్డీఓ కృష్ణవేణి, చిలువేరు రజనీభారతి, డాక్టర్ శోభ, నల్లా భారతి, గుర్రపు అరుణ, మైస వసంత, దామెర నర్సయ్య, మల్లారెడ్డి, మదన్‌రెడ్డి, లక్ష్మణ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్ర భవన నిర్మాణాలు చేపట్టాలి..

నర్సంపేట పట్టణం రామాలయ పాఠశాల ఆవరణలో ఉన్న అంగన్‌వాడీ కేంద్ర భవన నిర్మాణం చేపట్టాలని కోరుతూ కలెక్టర్ ప్రావీణ్యకు అంగన్‌వాడీ టీచర్ నల్లా భారతి, సెక్టార్ సూపర్‌వైజర్ ఝాన్సీ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సతీశ్ కుమార్ వినతిపత్రం అందించారు. అనంతరం కలెక్టర్‌కు పూలమొక్క అందించారు.

ఆర్టీసీ బస్సులో మంటలు

- అప్రమత్తమైన డ్రైవర్, కండక్టర్
- తప్పిన ముప్పు



ఇంజన్‌లో మంటలను ఆర్పుతున్న డ్రైవర్, స్థానికులు

డోర్నకల్: డోర్నకల్ రైల్వే స్టేషన్ ఎదుట మంగళవారం ఆగి ఉన్న ఆర్టీసీ బస్సులో మంటలు చెలరేగడం కలకలం రేపింది. ఖమ్మం డిపోనకు చెందిన ఆర్టీసీ బస్సు ఖమ్మం నుంచి ప్రయాణికులతో 11.30 గంటల ప్రాంతంలో డోర్నకల్ చేరుకుంది. అనంతరం సుమారు 15 ప్రయాణికులతో బయలుదేరేందుకు డ్రైవర్ స్టార్ట్ చేయగా ఇంజన్ నుంచి ఒక్కసారిగా మంటలు చేలరేగాయి. వెంటనే డ్రైవర్, కండక్టర్ అప్రమత్తమై ప్రయాణికులను బస్సు నుంచి దింపారు. సమీపంలోని ఆటోడ్రైవర్లు నీళ్లు తీసుకొచ్చి ఇంజన్‌పై చల్లడంతో మంటలు ఆరిపోయాయి. దీంతో ప్రమాదం తప్పింది. కాగా, స్టార్ట్ చేసిన సమయంలో సెల్ఫ్ మోటార్ వద్ద నిప్పులు చెలరేగి డీజిల్ పైపునకు అంటుకుని మంటలు చెలరేగి ఉంటాయని డ్రైవర్‌తో పాటు స్థానికులు అనుమానం వ్యక్తం చేశారు. బస్సు పాతబడడంతో ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు ఆరోపించారు.


ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తామని మోసం

- ఓ యువకుడి నుంచి రూ.20 లక్షలు వసూలు చేసిన దంపతులు
- పీక్లీతండాలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన

గార్ల: ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తామని మాయమాటలు చెప్పి ఓ యువకుడి నుంచి హైదరాబాద్‌కు చెందిన దంపతులు రూ.20 లక్షలు దండుకున్నారు. డబ్బు వసూలు చేసి 6 నెలలు దాటినా ఉద్యోగం రావడం లేదు. దీంతో సదరు దంపతులను పలుమార్లు ప్రశ్నించగా సరైనా సమాధానం ఇవ్వకపోవడంతో విగిసివేసారిన బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ ఘరానా మోసం మంగళవారం ఆలస్యంగా వెలుగుచూసింది. ఎస్సై జీనత్‌కుమార్ కథనం ప్రకారం.. గార్ల మండలం పీక్లీ తండాకు చెందిన బోడ సంజీల్ పీజీ చదువుకుని ప్రభుత్వ ఉద్యోగం కోసం సన్నద్ధమవుతున్నాడు. సంజీల్ సోదరి హైదరాబాద్‌కు చెందిన దంపతులు దాసరి రమ్య, విజయ్‌వంశీ ఇంట్లో పనిచేస్తోంది. ఈ క్రమంలో తాను పనిచేసే ఇంటి యజమానులు ఉద్యోగం ఇప్పిస్తారని తమ్ముడు సంజీల్‌కు చెప్పింది. దీంతో సంజీల్ హైదరాబాద్ వెళ్లి దాసరి రమ్యను కలిశాడు. ప్రభుత్వ ఉద్యోగం కావాలంటే రూ.20 లక్షలు చెల్లించాలని రమ్య.. సంజీల్‌కు తెలి పింది. దీంతో బాధితుడు సంజీల్ ఫోన్‌పే, బ్యాంకు అకౌంట్లు, నగదు రూపేణా దఫాల వారీగా 2023 జూన్ 30 నుంచి డిసెంబర్ 23 వరకు రూ.20 లక్షలు రమ్యకు చెల్లించాడు. కొంత నగదు రమ్య హైదరాబాద్ నుంచి పీక్లీతండాకు వచ్చి తీసుకెళ్లింది. అయితే ఉద్యోగం ఇంకా రావడం లేదని పలుమార్లు రమ్య ఇంటికి వెళ్లి అడిగితే వస్తుంది.. తొందరపడితే ఎలా..? అంటూ కాలయాపన చేస్తూ వచ్చారు. డబ్బు చెల్లించి 6 నెలలు దాటడం.. ఉద్యోగం రాకపోవడంతో విసిగివేసారిన బాధితుడు సంజీల్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో రమ్య, విజయ్‌వంశీ దంపతులపై ఫిర్యాదు చేశాడు. దీంతో ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

పోలీస్ ఇన్‌స్పెక్టర్ రాసలీలలు?

- పోలీసులకు రెడ్ హ్యాండెడ్‌గా చిక్కిన అధికారి
- పరారైన యువతి, స్నేహితులు
- సోషల్ మీడియాలో వైరల్



హసన్‌పర్తి: పక్క జిల్లాలో విధులు నిర్వహిస్తున్న ఓ ఇన్‌స్పెక్టర్ గలీజ్ పనికి ఒడిగట్టాడు. ఓ యువతితో రాసలీలలు సాగిస్తూ పోలీసులకు చిక్కాడు. ఈ సంఘటన వరంగల్ నగరంలోని చింతగట్టు సమీపంలో గల ఓ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం చోటు చేసుకుంది. ఈ విషయం సోషల్ మీడియాలో వైరలైంది. స్థానికుల కథనం ప్రకారం.. వరంగల్ జిల్లా వాస్తవ్యుడైన సదరు అధికారి ఖమ్మం జిల్లాలో ఎస్ఐబీ విభాగంలో ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. 2009లో కానిస్టేబుల్‌గా విధుల్లో చేరిన అతను 2014లో ఎస్సైగా ఎంపికై ఆ తర్వాత పదోన్నతి పొంది ప్రస్తుతం ఖమ్మం జిల్లాలో పనిచేస్తున్నాడు. ఆ ఇన్‌స్పెక్టర్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నట్లు తెలిసింది. మంగళవారం ఆ పోలీస్ ఇన్‌స్పెక్టర్ తన ప్రియురాలితోపాటు మరింత కొంతమంది స్నేహితులతో కలిసి చింతగట్టు సమీపంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో విందు ఏర్పాటు చేసుకున్నట్లు సమాచారం. ఓ గదిలో స్నేహితులు మద్యం సేవిస్తుండగా, మరో గదిలో యువతితో ఆ సీఐ రాసలీలల్లో మునిగి తేలినట్లు తెలిసింది. ఈ విషయం టాస్క్‌ఫోర్స్ పోలీసులకు చేరడంతో వారు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించగా యువతితో ఉన్న పోలీస్ ఇన్‌స్పెక్టర్‌ను చూసి షాక్‌కు గురైనట్లు సమాచారం. మద్యం సేవిస్తున్న స్నేహితులతోపాటు ఆ యువతి అక్కడినుంచి పరారైనట్లు తెలిసింది. కాగా, పోలీసులు ఆ ఇన్‌స్పెక్టర్‌ను అదుపులోకి తీసుకుని విచారించి వదిలిపెట్టినట్లు సమాచారం. సదరు ఇన్‌స్పెక్టర్ స్నేహితులను, యువతిని పోలీసులే తప్పించారా? లేక పరారయ్యారా? అనేది చర్చ జరుగుతోంది. ఈ విషయమై పోలీసులను సంప్రదించడానికి ప్రయత్నించగా ఎవరూ అందుబాటులోకి రావడం లేదు.